క థా ని క

# అక్క చెల్లెళ్లు

అవసరాల రామకృష్ణరావు

మసక చీకటిలో దీపం వెలిగిస్తున్న సంధ్య పరిచిత కంఠం విని తలెత్తి చూసింది. అక్క మొహం చూడగానే కష్టనిష్ఠురమైన ఆమె బాధిత హృదయం చల్లగాలి వీచిన మబ్బులా సజలమైనది. లాంతరు అక్కడ పెట్టి 'అక్కా' అని ఒక్క కేకవేసి, యిన్నాళ్ళకు దొరికిన ఆప్తహృదయాన్ని మనసారా, తనివి తీరా కౌగలించుకుంది. ఆమె రెండు చెంపల మీదా కన్నీటి ధారలు జీవనదిలా ప్రవహిస్తున్నాయి. వాత్సల్యంతో నిండిన అక్క కళ్ళు కూడా జలపూరితాలయ్యాయి.

తను రహీమ్ దగ్గరకు వెళ్ళిపోయే రోజున చెల్లెల్ని కౌగలించుకోవడం జ్ఞాపకం వచ్చింది ఛాయకు. ఆ కౌగలింతలో సంధ్య ఎంత బలంగా ఆరోగ్యంగా ఉంది! ఈ రెండేళ్ళలో యింత చిక్కిపోయి యిలా ఎముకలు గుచ్చుకుంటూ ఎంతలా మారిపోయింది! వివిధాలోచనలతో ఆ అక్కచెల్లెళ్ళు అలా అయిదు నిముషాలుండిపోయారు.

"అక్కా!...బావ..." సంధ్య మాట పూర్తి చెయ్యకుండానే ఛాయకు మరచిపోదామని విశ్వప్రయత్నం చేస్తున్న రహీమ్ జ్ఞాపకం రాగానే వెక్కి వెక్కి ఏడవసాగింది. "చెల్లీ, నేను నీకంటె ఎంతో అదృష్టవంతురాలనని మురిసిపోయాను. బంధువుల్ని విడిచాను, సంఘాన్ని త్యజించాను. నీలాంటి తోడబుట్టిన చెల్లెలితో సంబంధం తెంపుకున్నాను. ఇదంతా ఎందుకని? నాకు మీ అందరికంటె, ప్రపంచంలో ఎక్కడా లభించని హృదయం దొరికింది. సంధ్యా, ఆయన ఎంత మంచివారని చెప్పను! ఆ హృదయంలో ప్రేమ, వాత్సల్యం, లాలన మీ అందరినీ మరచి సుఖంగా బ్రతికే ఎన్నిగుణాలు ఉన్నాయని చెప్పను! మిమ్మల్నందరినీ కాదని ఆ కరుణామూర్తితో యావజ్జీవ సంబంధం ఏర్పరుచుకున్నాను. కాని..." ఛాయ మాట పూర్తి చెయ్యలేకపోయింది. దుఃఖపు తెరలు ఆమె నోటిని అడ్డేశాయి. చెల్లెల్ని కౌగలించుకుని భోరున ఏడ్చేసింది.

"అక్కా...నాకంతా తెలిసింది. మనలాంటి దురదృష్టవంతులు ప్రపంచంలో ఉండరు. కట్టుకున్న ప్రేమమూర్తి నీకు లభించకుండా పోయాడు. నేను ఆయన నా మొహమేనా చూడకపోగా ఇలా నిర్భాగ్యపు బ్రతుకు బ్రతుకుతున్నాను" అంది సంధ్య కన్నీళ్లు తుడుచుకుంటూ.

"అక్కా, మళ్ళీ వాళ్ళొచ్చేస్తే వదిన నిన్ను భోంచెయ్యనియ్యదు. పద అన్నం పెడతాను. ఎప్పుడనగా భోంచేశావో."

"అయ్యో, అన్నట్టు యీ దుఃఖంలో పడి అన్నయ్య మాటే మరిచిపోయాను. అన్నయ్యేడీ?"

"సినిమాకు వెళ్ళారక్కా."

"నిన్ను తీసుకెళ్ళలేదేం?"

"అయ్యో రామ. ఈ మొహానికి అదొక్కటే తక్కువయిందా!"

"అదేం?"

"అయ్యో, యీమధ్య యిక్కడ ఉండక నీకేసంగతీ తెలియదు. అన్నయ్యేదో ఉద్ధరిస్తాడని అమ్మ నన్ను అన్నయ్య కప్పగించింది. నిజంగా అమ్మ ఉన్నన్నాళ్ళూ ఏంసుఖం అనుభవించానో అంతే. ఇక్కడ వంటమనిషికన్నా అధ్వాన్నంగా ఉంది నా బ్రతుకు."

"అదేమిటి సంధ్యా. అన్నయ్య ఎంతో అభిమానంగా ఉండేవాడు కాదటే!"

"అవునవును ఉండేవాడు. ఎంత వరకు? వదిన వచ్చేవరకు. ఆ తరువాత ఆవిడ అడింది ఆట పాడింది పాట. అందరు మొగాళ్ళూ యింతే అనుకో."

"మన దురదృష్టంకొద్దీ మనకు తటస్థపడ్డారనుకోక అందరూ అలాగేఅనుకోడం ఎందుకు సంధ్యా. పోనీ వదినయినా మంచిదవకూడదా? అయితే వంటా పనీ అంతా నీవేనా?"

"ఒక్క వంటయితే బాగానే ఉండును. నన్ను రానిచ్చి వదిన దాసీదాన్ని కూడా మానిపించేసింది. కట్టుకున్న వాళ్ళు గుడ్డిగా ఏ పెద్దలమాటో విని వదిలిపెట్టేసి, అయిన అన్నగారు యిలా పెళ్ళాం గీచిన గీటు దాటకుండా ఉంటే మనలాంటి నిర్భాగ్యుల బ్రతుకేమౌతుందక్కా."

"పోనీ అన్నయ్యతో మంచీ చెడ్డా చెప్పుకో లేకపోయావా?"

"అయ్యో వెర్రిదానా! ఇంకా నువ్వు దొడ్డి దారినే ఉన్నావన్నమాట. ఇంతసేపూ నే చెపుతున్నదేమిటి? ఓ సరదాలేదు, సంతోషం లేదు. ఇలా పేడలోపడ్డ పురుగులా గిలగిలా తన్నుకుంటున్నానంటే నమ్ము. పైగా, ఎందుకు చేశావని మంచిమాట లేకపోగా..."

సంధ్య వాక్యం ఆపేసి చీర చెరగుతో కన్నీళ్లు తుడుచుకుంది.

"ఏమిటి సంధ్యా? ఆపేశావేం, చెప్పు."

"ఉన్న అవస్థలు చాలక ...వదిన అన్నయ్య రాగానే నేను పై మొగాళ్ళతో మాట్లాడుతున్నానని చాడీలు. అన్నయ్య ఆ మాటలు నమ్మి చిన్న పిల్లని తిట్టినట్టు యింత వయస్సు వచ్చి పెళ్ళయిన నన్ను చీవాట్లు. ఏం చెప్పను అక్కా! నాన్నా, అమ్మా, ఏనాడో పోయారు. నువ్వా సంఘానికి వెళ్లి ఎక్కడోవున్నావు. తోడి బుట్టిన అన్నయ్య యింతలా చూస్తున్నాడు, కట్టుకున్న మొగుడు ఎవరో ఎప్పుడో జరిపిన కలహాన్ని పురస్కరించుకుని నా మొహమేనా చూడలేదు. ఇంతకన్నా దైన్యస్థితి ఉంటుందా అక్కా? ఇన్నాళ్లయింది, మంచీ చెడ్డా చెప్పుకుందామంటే నీలాంటి మనిషైనా దొరకలేదు."

"నాకు రాయలేదేం సంధ్యా?"

"అయ్యో, నీపేరెత్తితేనే తగిలేవి చీవాట్లు. నే నేపని చేసినా వదిన కూడా ఉండేది. నువ్వు యిచ్చిన ఎడ్రసు ఎక్కడోపోయింది. అయినా రాసేం లాభం అక్కా?"

"ఈ నరకంనుంచి నువ్వు తప్పించుకోనడానికి మార్గమేమీ ఆలోచించలేదా?"

"ఏం ఆలోచించను? ఆలోచిస్తే అంతు దొరికే విషయమేనా యిది? ఏదో, నా ఖర్మ యిలా ఎన్నాళ్ళో అన్నాళ్ళూ జరగవలసిందే. నువ్వు యిలా నాశనమయిపోయావా?...సరే, అయిందేదో అయింది. ఇన్నాళ్లకు నిన్ను చూడగలిగాను. నాలుగు విషయాలూ నీతో చెప్పుకున్నాను. నా మనస్సు కొంత శాంతిగా ఉంది...లే భోంచెయ్యి. వదిన వస్తే క్షణం యింట్లో వుండనియ్యదు. పద."

సంధ్య అక్కను చేతితో తోసింది కదలమని. ఛాయ కదలలేదు. ఆమె పెద్దపెద్ద కళ్లల్లో ఏదో నిశ్చయం మెరుస్తోంది.

"మీ ఆయన ఏఊళ్ళోవున్నాడు సంధ్యా?"

"ఇప్పుడా మాటలన్నీ ఎందుకక్కా. రాజమండ్రిలో కాబోలు చదువుకుంటున్నారు."

"నీకు సరిగ్గా తెలుసా?"

"తెలుసు."

"అయితే అక్కడికి వెడదాం పద"

"వెళ్ళి?"

"నే మరదిగారితో మాట్లాడతాను. నిన్ను ఏ అధికారంతో వదిలేశాడో, ఏవిధంగా పరిగ్రహించడో అడుగుతాను."

ఛాయ దృఢనిశ్చయం చూస్తే సంధ్యకెంతో ఆశ్చర్యం వేసింది. ఇలాంటి సాహసం, దీక్ష ఉంటే ఎందరి అమాయక స్త్రీల కాపురాలు బాగుపడును?"

"మరి... అన్నయ్య మాట?"

"అన్నయ్యతోచెప్తే ఉల్లాఫగా చాకిరీ చేస్తున్న నిన్ను వదులుతాడా? అందులో కులం చెడిపోయిన నాలాంటి దానితో పంపుతాడా? లే! ఇంక నువ్వు పడుగూ పేకా వెయ్యకు. తొమ్మిదిన్నరకి 'డీ సి ల్' ఉంది. అందులో పోదాం."

అక్కయ్య అమూల్య అభయంలో సంధ్యకి లేని బలం వచ్చింది. లేచి అక్కా చెల్లెళ్లు అన్నం తిన్నారు. ఇన్నాళ్ళకు సంధ్య కడుపు నిండా అన్నం తింది. ఆశించని యీ వాత్సల్యానికి ఆమె ఉక్కిరి బిక్కిరై పోయింది. ఇద్దరూ సామాను త్వరత్వరగా సద్దుకున్నారు.

అంతలో ఏదో సందేహంతోచి సంధ్య యించుక తటపటాయించింది.

"ఏమిటే అది?" అంది ఛాయ చెల్లెలి ముఖ కవళికలు చూసి.

"ఏమీ లేదు. టిక్కెట్టుకు డబ్బు లేదక్కా" ఈమాటవిని ఛాయ సంధ్యని ప్రేమతో స్పృశించింది.

"ఎంత వెర్రిదానివే చెల్లీ, నా దగ్గర ఉందిలే. బంగారంలాంటి మనిషి పోయినా వంటినిండా కావలసినంత బంగారముందిలే" అంది ఛాయ.

* * *

సోమసుందరం వాచీ చూసుకున్నాడు. పావుతక్కువ పదకొండయింది. "అబ్బ! పది హేను నిముషాలు భరించాలి యీ చాదస్తం" అనుకుని లెక్చరర్ వంక చూశాడు. ఆయన తనకు అపరిచితమైన పదాలేవో తెగ దొర్లిస్తున్నాడు. తమకు బోధపడినా బోధపడక పోయినా విద్యార్థులు తప్పని సరిగా పాఠం వింటున్నారు. మధ్యమధ్య లెక్చరర్ వేసే "విట్సు"కి నవ్వురాకపోయినా విద్యార్థులు అనుగుణంగా నోరు తెరుస్తున్నారు. సోమసుందరం ఆడపిల్లల బెంచీవైపు చూశాడు. పర పురుషుడి వైపు చూడడం సభ్యత కాదనో, యిష్టంలేకనో ఆడపిల్లలు తలలు వంచుకున్నారు. ఎవరో ఒక కాగితం తెచ్చి లెక్చరర్ చేతి కిచ్చారు.

"మిస్టర్ ఎ. ఎస్. సుందరం?" సుందరం ఆశ్చర్యంతో నిలబడ్డాడు. విద్యార్థు లందరూ అతనివైపు చూశారు.

"నీకోసం యిద్దరు అమ్మాయిలు వచ్చేరుట, వెళ్లు."

క్లాసు ఒక్కసారిగా యీలలతో, నవ్వులతో గొల్లుమంది. 1951వ సంవత్సరంలో ఒక అబ్బాయికోసం యిద్దరు అమ్మాయిలు వచ్చినంత మాత్రాన అంత విరగబడ్డం ఎందుకో కొందరు విద్యార్థులకి అనుమానం తోచక పోలేదు. అలా అని వారు నవ్వడమూ మాన లేదు. ఆడపిల్లల హావభావ వికాసాలతో అట్టే పరిచయం లేని సుందరం లేత గుండెలుమాత్రం ధణధణ కొట్టుకున్నాయి. అతను సాధారణంగా ఏఅమ్మాయిల జోలికీ పోడు. వాళ్ళంటే కాస్త బెదురు కూడాను. అందులో యిద్దరు, ఎందుకొచ్చినట్లు? సుందరం క్లాసు విడిచి వెడుతూంటే అతని పాదాలకి అనుగుణంగా క్లాసులో 'లెఫ్ట్, రైట్' ధ్వనులు మ్రోగాయి.

కాలేజి కాంపౌండు పక్క ఎర్రగన్నేరు చెట్టు నీడలో యిద్దరు అమ్మాయిలు నిలబడడం సుందరానికి దూరాన్నుంచే కనిపించింది. అతడు వారిని చేరుకోనేలోగా అతని హృదయంలో ఎన్ని అనుమానాలు చెలరేగేయో, ఎన్ని భావాలు ప్రజ్వరిల్లాయో అతనికే తెలియాలి.

దూరంనుంచి యితన్ని గుచ్చిగుచ్చి చూస్తున్న సంధ్య యితను దగ్గిరకు రాగానే సిగ్గుచే పక్కకు తిరిగిపోయింది. ఛాయ మాత్రం యితనివైపే చూస్తోంది. ఆస్త్రీలలో ఒకరిని ఎక్కడో ఎప్పుడో చూసినట్టు సుందరానికి అనిపించింది. నాలిక చివర మాట ఆడినట్లు అతని కళ్లచివర ఆవిడ రూపం పైకి రావడానికి విఫలయత్నంతో నాట్యం చేస్తోంది.

"ఇక్కడేమిటీ మాటలు? అలా వెయిటింగ్ రూములో వెళ్ళి కూర్చుందాం రండి. ఇంకో ఐదు నిమిషాలకి రెండో గంట అవుతుంది. అందరూ బయటికి వస్తారు. చూస్తే బాగుండదు" అందా మనుకున్నాడు సుందరం. కాని మాట పైకిరాందే! ఆఖరికి ఎలాగో తెగించి,

"కబురు పంపించారుట నా కోసమేనా?" అన్నాడు.

"ఔను. ఈమె జ్ఞాపకమొచ్చిందా?" అనడిగింది ఛాయ.

సుందరానికి జ్ఞాపకంరాలేదు. తడబడ్డాడు.

"జ్ఞాపకం వచ్చిందా, మరిదిగారూ?" ఈ సంబోధనతో సుందరానికి అన్నీ జ్ఞాపకమొచ్చాయి. ఇంతలో సెకండ్ బెల్ "టంగ్ టంగ్" అని మోగింది. సుందరం గుండెలు దడదడలాడేయి.

"సరే, మేం వస్తాం మిమ్మల్ని "డిస్టర్బ్" చేసినందుకు క్షమించండి. మీతో అవసరమైన సంగతులు మాట్లాడాలి. సాయంకాలం మరచిపోక ఒకసారి పార్కుకి రండి" ఈ మాట అని వాళ్లిద్దరూ వెళ్ళిపోయారు.

ఆ అమ్మాయి లెవరో తెలుసుకుందామని, పరుగెడితే బాగుండదని గబగబ నడుస్తూవస్తున్న ద్యార్థులూ, ఆ వెనక సాటి సుందరీమణుల్ని చూద్దాం అన్న ఆశ చంపుకోలేక వస్తున్న విద్యార్థినులూ, ఆ వెనక చేతికర్రపట్టుకుని ఏదో పనిమీద వెడుతున్నట్టు నటించే లెక్చరరూ; ఈ సీను చూస్తే సుందరానికి ఫకాలున నవ్వు వచ్చింది. క్షణంలో విద్యార్థులందరూ అతన్ని చుట్టు ముట్టేశారు.

"ఎవరురా వాళ్లు?"

"ఎవరా చకోరాక్షులు?"

"చెబుమా"

"ఎవరా చక్కెర కేళీలు?"

ఇత్యాది ప్రశ్నలతో సుందరం వుక్కిరిబిక్కిరై "అందరూ నిశ్శబ్దంగా ఉండండి చెబుతాను" అన్నాడు. క్షణంలో అందరూ ఊరుకున్నారు.

"ఇద్దరు ఆడవాళ్లు!"

ఈ జవాబుతో ఆ ప్రదేశమంతా హాస్య రసంతో నిండిపోయింది.

* * *

పార్కుకి వస్తూ దారిలో తండ్రిమాటలు జ్ఞాపకం తెచ్చుకున్నాడు సుందరం: "పోనీ తల్లితండ్రులున్న పిల్లా అంటే వాళ్ళు చచ్చి రెండేళ్లు దాటింది. పోనీ వాళ్ళయినా మనం పెళ్ళిముందు అనుకున్నట్టు ముద్దూ ముచ్చటలూ తీర్చారా అంటే అదీ లేదు. ఆపిల్ల అక్క సంఘానికి వెళ్లి తురకాణ్ణి పెళ్ళాడింది. వర్ణసంకరం చేస్తే ఏమౌతుంది! ఆతురక ఆర్నెల్లు తిరక్కుండానే మంచినీళ్ళు అడక్కుండా చచ్చేడు. ఇక అలాంటి పిల్లని ఎలా తెచ్చుకుంటాం అబ్బాయ్! ఆపెళ్ళే అవలేదనుకో."

"అయితే వీరిద్దరూ ఎందుకొచ్చినట్టూ? నాతో మాట్లాడేటంత అత్యవసర విషయమేముంది? కులం చెడిన పిల్లతో బహిరంగంగా పార్కులో మాటాడితే, ఈ సంగతి మా నాన్నకి తెలుస్తే ఏమౌతుంది?" అనుకుని క్షణం తటపటాయించేడు. కాని అప్పటికే పార్కుకు వచ్చేశాడు.

"నువ్వెప్పుడైనా ఆ ఛాయతో మాట్లాడేవు సుమా నాయనా! మన కులం, గౌరవం అన్నీ నాశనమౌతాయి" తల్లి మాటలు స్ఫురణకొచ్చాయి. ఎదుటి పక్షవాదనలకి లొంగి రెండడుగులు వెనక్కి వేశాడు.

"ఏమండోయ్ మరిదిగారూ, వెళ్ళిపోతున్నారేం?" సుందరం గబుక్కుమని తలెత్తి చూశాడు. "అబ్బె... బ్బె... లేదు" సుందరం తడబడుతూ అన్నాడు.

"అలా దూరంగా పచ్చని గడ్డిలో కూర్చుందాం, రండి" అంది ఛాయ. అతడు మంత్రముగ్ధుడిలా వారిద్దరినీ అనుసరించాడు.

"మాయలో పడిపోతున్నావు సుమా నాయనా! ఛాయ తేనెలాంటి మాటలాడుతుంది. చూస్తూండగానే లొంగదీస్తుంది. మరలిపో" తల్లి చెపుతున్నట్టనిపించిందతనికి.

"అలా సందేహిస్తున్నారేం? నాలాంటి కులంలేనిదాంతో నలుగురిలోనూ మాట్లాడితే తప్పనా?"

"చాటుగా తాగుతే కల్లు పాలయిపోతాయా? మీరు చదువుకున్నవారు. నావైపు చూడండి. నన్ను ఇదివరకు చూడలేదు. కులం బాహ్యభేదాలకేగాని మనసుకు అంటుతుందా చెప్పండి?"

అవుననుకున్నాడు సుందరం.

"సరే. ఎందుకులెండి అనవసర ప్రసంగం! మీరు మా చెల్లెల్ని, అంటే దీన్ని పెళ్ళి చేసుకున్నారా?" సంధ్యని చూపించింది ఛాయ.

అవునని తల ఊపేడు సుందరం.

"మీరలా అటువైపు చూస్తూ కూర్చుంటే కాదు. యిలా దీనివైపు సరిగా చూడండి"

ఇన్నాళ్ళకు సుందరం కట్టుకున్న భార్యని పరిశీలనగా చూశాడు. ఎంత కళకళ లాడుతూంది ఆమె మొహం! సిగ్గుచే పక్కకు వాలిపోయిన అరమోడ్పు కళ్ళూ, నూది ముక్కూ, తీర్చిదిద్దిన గడ్డమూ; అప్పుడప్పుడే వస్తున్న చంద్రకిరణాలకు ఆమె వద్దే తగిన ఆహ్వానం లభిస్తోందా అనిపిస్తోంది.

"చూశారా, యీమెలో ఏమి లోటు వచ్చిందని, ఏం అపరాధం చేసిందని వదిలేశారు?"

"ఒకరు వదిలెయ్యమంటే వదిలేశాను గాని నేను వదిలేశానా?" ఈ మాట సుందరం మన

సులో అనుకుని అప్రయత్నంగా పైకి అనేసి నాలుక కరచుకున్నాడు. ఇంత దుర్బలత్వాన్ని ఛాయ భరించలేక పోయింది.

"ఎంత తేలికగా అన్నారు? ఇంత చదువు చదువుతూ, ఇంత వయస్సు వచ్చి మీ ప్రత్యేక సమస్యలు ఇతరులమీద వదిలెయ్యడం ఉచిత మేనా మీకు?"

ఈ ప్రశ్నకు సమాధానం తోచలేదు సుందరానికి. ఈమె ప్రశ్నలు అతన్ని అవమాన పరుస్తున్నట్టు లోలోన తోచినా ఆమె నుంచి వచ్చిన ప్రతి అక్షరం అతనికేదో ప్రబోధం కలిగిస్తున్నట్టు అతని అంతరాత్మ నొక్కి చెప్పడం వల్ల ఆమెకు అడ్డుచెప్పలేక పోయాడు.

"మా సంధ్య అదృష్టం వల్ల మీరు రెండవ పెళ్ళి చేసుకోలేదు. దీనిని తిరిగి పరిగ్రహించండి. మీరు తలుచుకుంటే క్షణంలో పెళ్ళి చేసుకోగలరు." కాని దీనికెలా అవుతుంది? ఇక దీని జీవితం నాశనమవవలసిందేనా?

వివిధ కారణాలచే తను సరిగా పరికించని నవయౌవన సుందరి, నవవికసిత ప్రసూనం తన వల్ల ప్రత్యేకం తన మూర్ఖతవల్ల బూడిద పాలవ వలసిందేనా? సుందరంలోని సంస్కరణావేశం అతన్ని "వద్దు, వద్దు" అని ప్రతిఘటించింది. ఇలాంటి అవకాశాన్ని ఛాయ జారవిడుచుకో లేదు.

"చూడండి సుందరంగారూ! మన పని మనం చెయ్యాలి. తరువాత దురదృష్టా దృష్ట నిర్ణయం ప్రకృతిది. ఇక మీకు చెప్పేదిలేదు; మీరు ఉండికూడా మీ భార్య అన్న యింట్లో దాసీదానికన్న .కనికష్టంగా బ్రతుకుతూంటే సహిస్తారా? అన్నీ ఆలోచించుకోండి, మీరు చేసిన పనిలోని తప్పొప్పులు మీకే తెలుస్తాయి. కన్నీటి కాలువలు సముద్రాలు చెయ్యకండి. మీ యిష్టం." ఛాయ ఊరుకుంది. సంధ్య భర్త సమాధానం కోసం నిముషమొక యుగంలా నిరీక్షిస్తోంది. ఆఖరికి సుందరం ధర్మానికి ఓడి పోయాడు. న్యాయా న్యాయాల ముందు తల వంచుకున్నాడు.

"నాకు అంతా బోధపడింది వదినా... చెప్పేడు మాటలు విని మనుష్యుల మంచిచెడ్డలు స్వబుద్ధితో తూచక యిన్నాళ్లూ తప్పుదారుల్లో పడ్డాను. మీ సంభాషణలు నన్ను జయించాయి. మీ సంస్కారం నన్ను గెలిచింది. మీరు ఎవర్ని పెళ్ళాడితేనేం మీ సహజ సుగుణాలు లవలేశమూ తగ్గలేదనీ, వ్యక్తిని నిర్ణయించేది కులం కాదనీ తెలుసుకున్నాను, నేను కల్పించిన కష్టాలికి క్షమించండి. మీ చెల్లెల్ని తప్పకుండా స్వీకరిస్తాను."

సంధ్య కాంతి చవితి వెన్నెలలో కలసి పోయింది. ఛాయ చీకట్లన్నీ వెన్నెలలో ఓడి పోయాయి. ఆ ప్రదేశమంతా ఆనందమయ మయి పోయింది. అనుకున్న పని అయిందన్న తృప్తితో ఆమె కళ్లు చెమ్మగిల్లేయి. ఆమెకు వయస్సుకు తగని పెద్దతనం వచ్చినట్లయింది. పది నిముషాలు ఎవరూ మాట్లాడలేదు. పార్కు యించుమించు నిర్మానుష్యమైంది. ఇద్దర్నీ ప్రక్క ప్రక్క నిల బెట్టింది. "నాకంతకన్న ఏం కావాలి మరదీ!" అని వారిద్దరినీ వాత్సల్యపూర్వకంగా ఆశీర్వదించింది.

*　　*　　*

ఆ మరునాడే సుందరం తండ్రికి ఉత్తరం రాశాడు.

"నాన్నా, నీ మాటల్లో పడి నేనెంత నిద్ర పోయానో మొన్న మేలుకొనేదాకా తెలియ లేదు. నేను మూడేళ్ళకింద పెళ్ళాడిన సంధ్యని మొన్ననే తెచ్చుకున్నాను. నా బాధ్యతను నేను నిర్వహించానని నాకిప్పుడు మనసు నిండుగా ఉంది. పెళ్ళాడిన భార్యని ఎవరిమీదో సాకులో చెప్పి వదిలెయ్యడం ఏ రకం సంస్కరణకు చెందుతుందో నాకు బోధపడలేదు. మమ్మల్నిద్దర్నీ కలిపిన పూజ్యురాలు ఛాయ నాదగ్గిరే ఉంది- సుందరం."

సుందరం కాలేజీనుంచి యింటికి వచ్చేసరికి ఛాయ పెట్టె సద్దుకుంటోంది. అతన్ని చూడ గానే సంధ్య గబగబా వచ్చి ఇలా అంది.

"మీరయినా కాస్త చెప్పండీ, నే చెబితే వినడంలేదు. మా అక్క వెళ్ళిపోతుందిట"

"ఆదేమిటి వదినా, ఎక్కడికీ?" ఛాయ ఓ క్షణం మాట్లాడలేదు. తరువాత,

"ఎక్కడి కేమిటి మరదీ, నా స్థానం ఎక్కడికో అక్కడికే. ఆడదానికి భర్త సాన్నిధ్యమే అనువైన స్థానం. అక్కడికే" అంది.

ఛాయకు యిలా అనడానికి తగిన కారణాలు లేకపోలేదు. ఆమెకుకూడా పాతికేళ్లు దాటలేదు. సరిగా అర్ధరాత్రి ప్రక్కగదిలో సుఖతరంగ సంభాషణలు వింటున్న ఆమె పడుచు హృదయం అలవాటులేని అసూయతో, అశాంతితో కొట్టుకుంటోంది. కన్ను మూసేసరికి తను, రహీమ్! ఎన్నిసార్లు తలుచుకుంటే తన నిర్భాగ్యముపోతుంది! ఆ అభాగ్యకు ఇక శాంతి సాధన మేముంది? ఆమె మనస్సు వికలంతో శకలమయింది. తల్లి, కొడుకూ కోడలూ సుఖంగా తన కళ్ళముందు బతుకుతూంటే చూసి సంతోషించినట్టుగా వయస్సుకి తగని పెద్దతనం తెచ్చుకుని ఆమె సుఖపడలేకపోయింది. వారిద్దరూ సినిమాలకు వెడతారు, షికార్లకి వెడతారు. వారితో వారికి అడ్డుగా తను వెళ్ళనూలేదు, వంటరిగా ఉండనూలేదు. రహీమ్ తనూ మొదటి రోజుల్లో ఎన్ని ప్రదేశాలు తిరగలేదు! ఈ నవ దంపతుల ప్రతిచేష్టా తన్నూ, తన రహీమ్‌నూ జ్ఞాపకంతెచ్చి ఆమె మనస్సును బద్దలుచేస్తూంది. ఇక ఆమెకు ఆ యింట్లో స్థానంలేదా అనిపిస్తోంది.

ఈ సమస్య సంధ్యా సుందరాల్నికూడా పీడించకపోలేదు. అనుకోకుండా, హఠాత్తుగా యిల్లు అద్దెకు తీసుకోవలసి వచ్చింది సుందరానికి. అందుకని ప్రక్కప్రక్కనే ఉన్న రెండు గదులు మాత్రమే యిరవైరూపాయలకి అద్దెకు తీసుకున్నాడు. ఒకటి వంటిల్లు. ఒకటి పడక గది. వంటింట్లోనే ఓచాపపరుచుకు పడుకొనేది ఛాయ. సంధ్య ఏరాత్రివేళ మేలుకొని యీ గదికివచ్చినా ఛాయ మేలుకునే ఉండేది. ప్రక్కని "కాపలా"గా ఓమనిషి కనిపెట్టుకు ఉండడం వారిద్దరికీ నచ్చలేదు. ఇదిగాక యింకో ముఖ్యకారణముంది: సంధ్యకి ఛాయ తనకన్న అందకత్తె అని తెలుసు. మొదటిలోలేని అనుమాన ఛాయలు సంధ్యని ఎప్పుడూ కలవరపెట్టేవి. ఛాయా సుందరాలిద్దరే ఒకచోట ఉండే అవకాశం కలుగనియ్యొద్దని దేముణ్ణి ఎప్పుడూ ప్రార్థించేది. ప్రతి పనీ భర్తకి తనే స్వయంగా నిర్వహించేది. ఆ అనుమానపు కళ్లు ఎప్పుడూ ఏదో తప్పును వెతుకుతూనే ఉండేవి. "ఇది పోతే బాగుండును!" అనిపించేది సంధ్యకు అప్పుడప్పుడు. కాని ఉత్తరక్షణం 'ఎక్కడికి?' అన్నప్రశ్న ఉదయించింది. కాని "ఎండిపోయిన మా జీవిత ఎడారులలో అమృతవర్షం చిలికిన పుణ్యమూర్తి" అని అప్పుడప్పుడు జ్ఞాపకం వచ్చి ఆమె తన దుష్టాలోచనలు తన లోనే అణచేసుకునేది.

ఇక సుందరమా? అతని కప్పుడు ప్రపంచంలో సంధ్యాకాంతి తప్ప మరొకటి ప్రసరించడం లేదు. ఆమె మాటను జవదాటే ఆలోచనలు అతనికి క్రోసెడు దూరంలోకేనా రావడంలేదు. ఓసారి సంధ్య అంది:

"ఏమండీ, మా అక్కయ్యకు మళ్ళీ పెళ్ళి చేద్దామా?"

"మరి వంటకో" అని అప్రయత్నంగా అనేవాడు సుందరం. ఈ మాటలు ప్రక్కగదిలో ఛాయ విని ఆరాత్రంతా బాధపడింది. అయినా సంధ్య యీ ప్రసక్తి వదలలేదు. మరునాడు కాఫీలవేళ,

"అక్కా, నువ్వు తిరిగి పెళ్ళి చేసుకోకూడదూ?"

"మరి వంటకో?" ఆ అవకాశం జారవిడవక అప్పచెప్పేసింది ఛాయ. సంధ్య దెబ్బతిన్న లేడిలా భర్తవైపు చూసింది. అతనూ సిగ్గుతో తల వంచుకున్నాడు. "ఆయన, చదువు ఎక్కువై, మతిలేక ఓమాటకోమాట అన్నారు. క్షమించక్కా!" అంది సంధ్య. తన తరఫున యిలా సద్దిచెప్పడానికి సుందరం ఆనందంతో హాస్యాలాడేడు.

"నన్నింకా ఏడిపించడం మీకు సరదాగా ఉందా సంధ్యా? నాకు రహీమ్ తప్ప మరో ప్రపంచం లేదు. ఆయన ఏలోకంలో ఉన్నా ఆయనే నా భర్త. తుచ్ఛమైన యీ శరీరం కోసం ఆయన ఆత్మ కశాంతి కలిగిస్తానా సంధ్యా?" అని ఛాయ ఏమీ చేయలేని తన దుస్థితికి వెక్కి వెక్కి ఏడవనారంభించింది. ఆ మరునాడే ఆమె ప్రయాణం కట్టింది.

సద్దుతున్న పెట్టెలోంచి చీరలివతలికి తీసేసి "మీరు వెళ్ళడానికి వీల్లేదు వదినా. నా బుద్ధి తక్కువకొద్దీ ఏదో నోటికివచ్చిన మాటన్నాను. నన్ను క్షమించి ఆమాట మరచిపోండి. మీరు వెడితే నన్ను చంపుకుతిన్నట్టే!" అంతలా మరది

ప్రార్థిస్తూంటే కొదవలేక ఛాయ ఆనాటికి ప్రయాణం ఆపుచేసింది. తన భర్త యింత చనువుగా అక్కయ్యను అడ్డుపెట్టడం సంధ్య సహించలేకపోయింది. రుసరుసలాడుతూ గదిలోకి వచ్చి,

"మీరేమంత కానిమాటన్నారనీ అదంత బతిమాలించుకోడానికి? వెడతా నన్నదాన్ని వెళ్ళనియ్యక పోయారా?" అంది.

"నేను ఎంత ఆలోచించి ఆవిడను వద్దన్నానో నీకేం తెలుసు? ఇలా దగ్గరగారా చెప్తాను. మళ్ళీ నిన్నటిలా వినిపిస్తే బాగుండదు. ఆవిడ వెళ్ళిపోతే వంటెవరు చేస్తారు? నెల్లాళ్లయింది, నాన్న జవాబు రాయలేదు, కానీ పంపలేదు. అసలే అన్నిటికీ ఎంతో యిబ్బందిగా ఉంది. కాలేజీ జీతం ఇంకా కట్టనేలేదు. ఇలాంటప్పుడు వంటమనిషిని ఎలా పెడతాను? నీలాటి 'సుకుమారి'ని చూస్తూ చూస్తూ ఎలా వండమనగలను?"

'సుకుమారి!' అన్న యింట్లో రెండేళ్ళపాటు వెట్టిచాకిరీ చేసిన తాను ఈనాడు భర్తృసాన్నిధ్యంలో 'సుకుమారి' అయిపోయింది! ఆమెకు భర్తమీద ప్రేమ పొరలి పొంగి అత్తణ్ణి శరీరమంతా విరిగేలా కౌగిలించుకుంది.

* * *

శేషగిరి గారంత సమయోచిత వర్తనులూ, అనుభవశాలులూ చాలా తక్కువ అని చెప్పొచ్చు. ఆయన ఏ విషయమైనా ఎంతో ఆలోచించి ఏ విధంగా చేస్తే జయమౌతుందో ఆ బాణాన్ని కాని వదలరు. కొడుకు ఉత్తరానికి ఏవిధంగా జవాబు రాద్దామా, ఏం చేదామా అని ఆయన తన బుద్ధినంతటినీ వినియోగించి నెల్లాళ్లు తటపటాయించారు. ఒక్కగానొక్క కొడుకు. ఆయనకు అభిమానం అంటూ ఏదైనా ఉందంటే అది సుందరం మీదే. మూడేళ్ళ క్రిందట సుందరానికి పెళ్ళి చేశారు. ఆడపెళ్ళివారు ముందు అనుకున్నట్లు ఏమీ జరుపలేదు. పట్టుదల ఎక్కువై. మధ్యవాళ్ళ ప్రోద్బలాలు మనసులో బాగా నాటుకుని, చిలికి చిలికి గాలివానై పోయింది. ఆ దెబ్బతో సంబంధం తెగిపోయింది. కొడుక్కి తిరిగి పెళ్లి చేద్దామని ఆయన అన్నిరకాల యత్నాలూ చేశారు. తన జీవితంలో మొదటి యత్నమే విఫలమవడం సుందరం మనసుకి 'చురుక్'మని తగిలింది. "ఇది యిలా అయింది గదా. యిక తొందరేమిటి నాన్నా, నా చదువేదో పూర్తి అవనీండి" అని ఆపేశాడు.

కన్నకడుపు తీపిచేత భార్య ప్రోద్బలం అనండి, తన విశేష ఆలోచనా సారాంశం అనండి, శేషగిరిగారు ఒక దరికి చేరేరు.

"మీపట్టుదల మీదేగాని వాడెంత ఇబ్బంది పడుతున్నాడో చూడక్కర్లేదా? పంపిన సొమ్ము హాయిగా ఖర్చు పెట్టుకోవడమేగాని యిలా కుటుంబాన్ని పోషించడం వాడెరుగునా? నాతండ్రి ఎంత బాధపడుతున్నాడో! ఓనెల సొమ్ము పంపనంతమాత్రాన వాడికి బుద్ధొచ్చేస్తుందా? మీరు సొమ్ము పంపకపోతే, నాతండ్రి తెలివితక్కువవాడు కనుకనా, ఏదో పనిలో చేరితే?"

"ఏదో పనిలో చేరితే?" శేషగిరిగారు హడలిపోయారు. వీథితలుపు వేసిఉంటే పెరటిదారిని వెతుక్కోడం అసహజ విషయం కాదు. చదువు మధ్యని ఆపేసి ఏదో పనిలో చేరితే యిన్నివేలూ పోసి చెప్పించిన చదువు ఏమౌను? సొమ్ము పంపించడం కూడా అంత మంచి విషయంగా తోచలేదు శేషగిరిగారికి. ఆయన భార్యని యిలా అడిగేరు.

"ఏమే, కోడలు ఎలాంటిదే?"

"ఎలాంటిదేమిటి? నిక్షేపంలా ఉండేది. కన్నొంకరా? కాలొంకరా? చారెడేసి కళ్ళూ అదీ, చుక్కలా ఉండేది. పనీపాటూ అన్నీ



చాతనయిన పిల్ల. రెండేళ్ళపాటు అన్నదగ్గిర ఉండి సర్వచాకిరీ చేసిపెట్టింది."

సమయానుకూలంగా వ్యక్తుల్ని తూచడం స్త్రీలకా చెప్పాలి? -

"అయితే సామానులు సర్దు. రేపే రాజమండ్రి వెడదాం."

"అదేమిటండీ అక్కడ ఆపిల్ల అక్కవుందిగా, వాళ్ళింట్లో ఎలా దిగుతాం?"

"నేనంతా చెబుతాగా, ముందు సామానులు సర్దు."

* * *

"అక్కా, ఓ అక్కా!" తులసికోటలో నీళ్ళుపోస్తున్న ఛాయ తలెత్తి చూసింది. సంధ్య గబగబా వచ్చింది. ఆమె ముఖంలో సంతోష రేఖలు తొంగి చూస్తున్నాయి. "అక్కా, ఇవాళ మెయిల్లో మా అత్తగారూ, మామగారూ వస్తున్నారట" ఈమాట అంత విచిత్రంగా కనిపించలేదు ఛాయకి.

"అయితే?"

సంధ్య చెప్పడానికి సందేహిస్తున్నట్టు తోచింది.

"అయితే- ఏమిటి? చెప్పు."

"మరేంలేదు. మా అత్తగారు నీ చేతివంట తినరుట. ఇవాలిటికి నేనే వండుతాను. ఈ మాట చెప్పమన్నా రాయన"

చెప్పవలసింది చెప్పి సంధ్య సమాధానం కోసమయినా చూడకుండా వెళ్ళిపోయింది. ఛాయ నిర్ఘాంతపోయి నిలబడిపోయింది. ఆమెకు తెలీకుండా ఆమె రెండుకళ్ళూ నీటితో నిండిపోయాయి.

"నేను తల్లితండ్రులు లేనిదాన్ని, సంఘానికి వెలైనదాన్ని, తోడబుట్టిన సోదరినుంచి యిలాంటి తిరస్కృతి నిత్యం పొందుతున్నాను. వీరెవరూ నాకు లెక్కలేదు. ఈ మూర్ఖులతో నాకు పనిలేదు. నాకు సరిపడిన హృదయం, నన్ను ఎప్పుడూ ఆరాధించే హృదయం నా రహీమ్ నాకు చాలు. కాని ఆయన ఏరీ? ఎక్కడ ఉన్నారు? ఎక్కడినుండి నన్ను పిలుస్తున్నారు?"

ఆమె నిశ్చయానికి వచ్చేసింది. ఆమె చేసిన మంచి పనులు ఆమెపైనే పగ తీర్చుకున్నాయి. లేచి కన్నీళ్లు తుడుచుకుంది. జుత్తు ముడేసుకుంది. తిన్నగా మేడమీదకు వెళ్ళింది. తల్లిదండ్రులు వస్తారని యింటి యజమానిని బ్రతిమాలి సుందరం యీ మధ్య మేడమీద రెండు గదులుకూడా అద్దెకు తీసుకున్నాడు. ఛాయ మేడమీద గదిలో తన పెట్టె తీసుకుంది. స్టేండుమీద రెండుచీరలు పెట్టెలో పెట్టేసుకుంది. వెళ్ళకూడదనుకుందిగాని మళ్లీ మనసు పీకి ఆ పక్కగదిలోకి వెళ్ళింది. సుందరం ఒళ్లో సంధ్య కూర్చునుంది. ఈమె రాగానే లేచి నిలబడింది.

"వెడుతున్నాను మరిదిగారూ, వస్తాను చెల్లీ!" ఆమె కంఠం రుద్ధమైపోయింది. సంధ్య కాని, సుందరం కాని వద్దనలేదు. ఎక్కడికని అడగలేదు. అలా శిలాప్రతిమల్లా కూర్చున్నారు. ఛాయ మేడమెట్లు దిగుతూ యిలా అనుకుంది:

"మేడ ఎక్కిన తరువాత మనం పీటిమీద నించి దిగం అని తలుచుకునేవారు ఎంతటి వాళ్ళు!"

ఛాయ ఆ యింట్లోంచి యివతలికి వచ్చేసింది. ఆమె బ్రతుకంతా విషాద ఛాయలతో నిండిపోయింది.

"నాకు సంఘంలో స్థానంలేదు. ప్రేమించిన చెల్లెలిదగ్గర స్థానంలేదు. ఈ ప్రపంచంలోనే నాకు స్థానంలేదా ప్రభూ!" అని ఏడ్చింది.

"మరి వంటకో!" ఈ మాటలు జ్ఞాపకానికి వచ్చి ఆమె అభిమాన హృదయం భగభగమండింది. నేను వంటకేనా వీళ్ళింట్లో ప్రవేశించింది! డబ్బులేక నేనా వీళ్ళ పంచచేరింది? లక్షలకొద్దీ విలువచేసే ప్రేమైక హృదయం అంతరించి పోయిందిగాని ఆయన యిచ్చిన సొమ్ము కొల్లలుగా పడివుందే! తను కోరింది ఒక్క ప్రేమ హృదయం. తనను అభిమానించే రెండు కన్నీటి చుక్కలు. విరహతప్తయైన తను ఆశయించింది ఒక్క వాత్సల్యపూరితమైన మాటకోసం. ఇదేనా యింత దేశంలో కరువయింది?

ఆమెకు గోదావరి గలగల వినిపించింది. అందులో ఆమెకు 'రహీమ్' పిలుపు వినిపించింది. 'పిలుస్తున్నారా రహీమ్!' ఒక్క కేక వేసి ఆమె గోదావరివైపు పరుగుపెట్టింది!